# జీవితపు విలువ

బస్సు దిగింది. అడుగులో అడుగు వేసుకుంటూ ఒక వందగజాలు నడిచింది. సరిగా ఆ సందులోకే!

ఒకదశ గడిచిపోయింది. యిదే వేళకి, యిలాగే, యీ సందమ్మటే నడుస్తూ పోయేది. మళ్లీ యీనాడు నడుస్తోంది అదేసమయాన. జయలక్ష్మిని స్మృతులు బాధపెడుతున్నాయి. పాతకాలపు జ్ఞాపకాలు పదేపదే పలకరిస్తున్నాయి.

చెట్టు చిగిర్చి పువ్వులుపూసే సమయాన మొదలు విరిగింది. తుపాను గాలివల్ల జీవిత వృక్షం కూకటివేళ్ళతో పెల్లగించుకు పడిపోయింది. తనెందుకు బతుకుతోంది? ఏ ఆశ చూసుకు తిరుగుతోంది? చావలేక బతకడమా? చావడం అంత సులభంకాదు కాబట్టి అవును, కోరినప్పుడు మృత్యువు రాదు.

మలుపు తిరిగింది జయ. నాలుగు అడుగులు పడ్డాయి. కుడివైపు నాలుగోయింటి కాంపౌండ్ గోడమీద మీదికి వరిగిన తురాయిచెట్టు–తన తురాయిచెట్టు–యింకా అల్లాగేవుంది. తనను ఎవరో ఆపినట్టు టక్కున ఆగిపోయింది జయ. ఏదో గుండెల్లో పొడిచినట్లయింది.

ఆ తురాయి నీడలోనే మొట్టమొదటిసారి రామాన్ని చూసింది. ఈనాడు రామం లేడు. మోడుబారిన తను తురాయినీడలో....

జయకళ్ళు చెమరిస్తున్నాయి. ఎన్నాళ్ళు కారుస్తుంది కన్నీళ్ళు? మూడేళ్ళనుంచీ తనకంటి తడి ఆరడం లేదు. కన్నీళ్ళు రామాన్ని వెనక్కి తేగలవా? పోనీ, తన తండ్రినైనా?

*  *  *  *  *

డిప్టీకలెక్టర్ సుబ్రహ్మణ్యం మొదటి భార్యకు ఒక కొడుకు. ఆవిడ పదేళ్ళు కాపరంచేసి కాలం చేసింది. రెండో భార్య సుభద్రమ్మను ఆయన ఏరి కోరి చేసుకున్నాడు. ఆవిడ కూతురే జయ. మొదటిభార్య కొడుక్కీ, సుభద్రమ్మకీ క్షణం పడేదికాదు. సుబ్రహ్మణ్యం తెలివిగలవాడు. కాబట్టి కొడుకుని మొదటినుంచీ హాస్టల్లో ఉంచి చదువు చెప్పించాడు. తండ్రి

కొడుకులమధ్య డబ్బు ప్రేమేయంతప్ప, ప్రేమాభిమానాలుండేవి కావు. సత్య శలవకు వచ్చినా ఏదో పరాయివాడిలా సంచరించేవాడు. జయకికూడా అతనంటే అంత యిష్టం వుండేదికాదు. సుబ్రహ్మణ్యం బాధ్యతాయుతుడైన తండ్రికాబట్టి కొడుక్కి బి. యిడి. చెప్పించి పెండ్లి పేరంటం జరిపాడు. తండ్రిమీద ఆధారపడాల్సినవాడికి ఉద్యోగం లభించడంవల్లా, కాస్త మంచీ చెడ్డా చూసేందుకు అత్తవారు దొరకడంవల్లా, తన సంసారం అంటూ ఏర్పడింది. తరువాత సత్యంకూడా తండ్రికి దూరం అయ్యాడు.

సుబ్రహ్మణ్యం తన కూతురు బాగా చదువుకొని యిష్టంవచ్చిన వరుణ్ణి వెతుక్కోవాలనే వుద్దేశంతో జయని చదివించాడు. తండ్రి ఆశయాలకి అనుగుణంగా చదువుకుంటూండేది ఆమె. ఇంటర్ సీనియర్‌లో ఉండగా తల్లికి మశూచికం సోకి చచ్చిపోయింది. భార్య మరణంతో సుబ్రహ్మణ్యం పిచ్చివాడయ్యేంతపని అయింది. జయ తండ్రికి ధైర్యంచెప్పి, వేదాంతం బోధించేది. ఇద్దరూ తండ్రి కూతుళ్ళుగాక - తల్లీ కొడుకుల్లా మారిపోయారు. జయ వయసులో చిన్నదైనా తండ్రిని సముదాయించాల్సివచ్చింది. తల్లి మరణంతో ఇంటి బాధ్యత జయ నెత్తిన పడింది. ఈగొడవల్లో ఆమె ఇంటరు తప్పింది.

సుబ్రహ్మణ్యం స్థలం మార్పుకని, ఏడాది శెలవుబెట్టి మద్రాసు వచ్చాడు ఆ ఏడాది జయ ఇంటర్ పూర్తిచేసే ప్రయత్నంలోవుండి, ఇంటి దగ్గిరఉంటే పొద్దుపోక, తన తండ్రికి తెలిసిన కాన్వెంటులో, తండ్రి పరిచయాన్ని పురస్కరించుకుని టీచరుగా చేరింది. మొదట్లో అల్లిక కుట్లు నేర్చుకునేందుకు, కాన్వెంటు సిస్టర్సు దగ్గిరకు వెళ్తూండేది. వూసుపోక పిల్లలకు తెలుగు పాఠాలు ప్రారంభించింది. 'నాకు సిస్టర్సు ఎంబ్రయిడరీ నేర్పుతున్నారు. కనక వారికి బాకీపడి వుండటం భావ్యంకాదని- యీ పని మొదలెట్టాను" అంది తండ్రితో.

జయ ఇలా వుద్యోగం చెయ్యడం తండ్రికి ఇష్టంలేదు. డిప్టీకలెక్టరు ఏకైక పుత్రికారత్నం పంతులమ్మపని చెయ్యాల్సిన ఖర్మమేమిటి? కాని డబ్బు పుచ్చుకోకుండా-స్నేహార్థం చేస్తున్న ఉద్యోగం కాబట్టి, తమ దర్జాకు లోపంరాదని సరిపెట్టుకున్నాడు డిప్టీకలెక్టర్ సుబ్రహ్మణ్యం.

జయ రోజూ స్కూలుకి వచ్చేవేళ, రామం సరిగా ఆ సందు మలుపు

తిరిగే వేళ. ఆతను ఆఫీసుకు బయలుదేరుతూండేవాడు, ఆమె స్కూలు వైపుగా వెళ్తూండేది.

మొదట ఒకరినొకరు రోజూ చూసుకోవడం, కళ్లతో పల్కరించుకోవడం, చిరునవ్వులు, నమస్కారాలు క్రమంగా మాటల్లోకి దిగారు. ఒకరి సంసారాలు మరొకరికి పరిచయం అయాయి. రామం ఇన్కంటాక్సు ఇన్స్పెక్టరు. పెద్ద ఉద్యోగమేమీ కాదది. కాని అతను చూపులకు బావుంటాడు. తెలివిగలవాడు. రామానికి ఒక తమ్ముడూ, ముసలి తల్లీ వున్నారు. ఇదీ వాళ్ళ సంసారం.

కూతురు ఉత్సాహం చూసి సుబ్రహ్మణ్యం ఆమె మనసు గ్రహించాడు. రామం ప్రతి సాయంత్రం కాలక్షేపానికి సుబ్రహ్మణ్యంగారింటికి వెళ్ళేవాడు. జయ చక్కని వరుణ్ణి వెతుక్కున్నందుకు సంతోషించాడు సుబ్రహ్మణ్యం. ఇద్దరికీ ఒక శుభముహూర్తాన పెండ్లయింది.

పెండ్లి ఫిబ్రవరిలో జరిగింది. పెండ్లయిన తర్వాత భర్తకీ, తండ్రికీ జయ స్కూల్లో పనిచేయడం ఇష్టంలేదు. కాని సంవత్సరం మధ్యలో, స్కూలు వదిలేయడానికి ఆమె ఒప్పుకోలేదు. ఏప్రియల్లో స్కూళ్ళు మూసినప్పుడు ఉద్యోగం మానేస్తానంది.

రోజూ సాయంత్రం ఆఫీసునుంచి సరాసరి స్కూలుకొచ్చి గేటు దగ్గిర నిలబడేవాడు భర్త.

"ఇన్నాళ్ళూ వొంటిగా, రాలేదా, పోలేదా? నేనింటికి రాలేనా? మీకెందుకీ శ్రమ" అనేది జయ.

"ఇలా నిన్ను ఇంటికి తీసుకెళ్ళడం నాకెట్లా ఉంటుందో నీకు తెలుసేవా?" అని ఆగిపోయాడు రామం జయ కళ్లలోకి చూస్తూ. మాటల్లోకి మారని సందేశం ఎంత ఉండేదో ఆకళ్ళల్లో! టప్పున కన్నీటిబొట్లు చీరమీద పడ్డాయి. జయ అలాగే నిల్చుండిపోయింది. ఏడి ఆనాటి తన భర్త? ఎంత ప్రేమించింది తను? ఇంతేనా చివరికి! అంతా శూన్యమే!

కాన్వెంటు మూసేరోజున ఎంత హడావుడి! టీచర్సు, సిస్టర్సు, పిల్లలూ వీడ్కోలు విందు ఎంత చక్కగా చేశారు!

ఆనాడు తన చెయ్యి నొక్కుతూ భర్త "అమ్మగారివల్ల అయ్యగారికి ఓ దండ వేశారు" అని అంటే తనెంత పొంగిపోయింది! సంతు మలుపుతిరిగే

దాకా పిల్లలు "వేవ్" చెయ్యడం నిన్న జరిగినట్టుంది. ప్రతివాళ్ళూ తనకు శుభం కలగాలని ఆశీర్వదించారు కాని...

*          *          *          *

వేసంగి అయింతరువాత సుబ్రహ్మణ్యం డ్యూటీలో జాయిన్ అయ్యాడు. రామాన్ని ఐదువందల జీతంతో బ్రాంచ్ మేనేజరుగా కలకత్తా పంపించారు. అందరూ జయ అదృష్టవంతురాలన్నారు. అత్తగారు మహాలక్ష్మి అంది. భర్త దేవతన్నాడు. తండ్రి వరహాల తల్లివన్నాడు. తను పొంగి పోయిందానాడు. ఈనాడు వాళ్ళమాటలన్నీ తన్ని వెక్కిరిస్తున్నాయి. తనదీ ఒక బతుకేనా ?

అత్తగార్నీ, మరిదినీ మద్రాసులో వదిలి జయా భర్తా వెళ్ళారు. కొత్త కాపరం. జయలక్ష్మి నడిస్తే అరిగిపోతుందేమోనన్నంత గారాబంగా చూశేవాడు భర్త. కావలసినన్ని చీరెలూ, నగలూ భర్తకూడా పుష్కలంగా సంపాయించేవాడు. ఆమెకింకా ఏంకావాలి ? తనఅదృష్టానికి మురిసిపోయేది. ఆయిదేళ్ళూ అయిదు క్షణాల్లా గిర్రున తిరిగిపోయాయి. తండ్రి ఫించను పుచ్చుకున్నాడు. అత్తగారు చనిపోయింది. మరది కాలేజీ క్లాసులోకి వచ్చాడు.

ఆ ఏడు సంక్రాంతికి భార్యా, భర్త లిద్దరూ కలిసి పాలుకొల్లు వెళ్తామని ప్లాను వేసుకున్నారు. పాలకొల్లులోని ఇంటికి సున్నాలూ, రంగులూ వేయించాడు సుబ్రహ్మణ్యం, అల్లుడూ కూతురూ వస్తున్నారనే అట్టహాసంతో.

కలకత్తాలో మతకలహాలు జాస్తిగావున్న రోజులవి. జయని పుట్టింటికి వెళ్ళిపొమ్మని భర్త తొందరబెట్టాడు. కాని అతన్ని ఆ అపాయంలోవదిలి తను వెళ్ళిపోగలదా ? "బ్రతుకుతే ఇద్దరం బ్రతుకుతాం-లేకపోతే ఇద్దరం చస్తాం" అని అన్నదేగాని, ఆమె మాట అబద్ధం అయింది.

ఆఫీసుజమాన్ రషీద్‌ని ఎవరో పొడిచారని విని, వివరాలు తెలుసుకునేందుకు వీధిలోకి వెళ్ళాడుభర్త. దుశ్శకునమైనా తోచలేదు. తనకు తమమీద ఎవరికి విరోధముంటుందని అనుకున్నారు. మూడురోజుల తర్వాత, వాళ్ళ ఆఫీసుగుమస్తా, శవాన్ని గుర్తుపట్టి యింటికొచ్చి చెప్పాడు తనకి.

బ్రహ్మప్రయత్నంమీద ఆమె ఆ నగరంనుంచి తప్పించుకుని కట్టుబట్టల్తో తండ్రిచేతుల్లో వాలింది.

ఏడాదిపాటు జయ పక్కవదలి రాలేదు. భర్తని గుండాలుఎలాపొడిచి వుంటారో, అతను ఎంతబాధపడి వుంటాడో వూహించుకుంటూ నిద్రట్లో కెవ్వుమనేది. కూతురుకూడా దక్కదేమోనని సుబ్రమణ్యం భయపడ్డాడు.

మరుసటిసంవత్సరం తండ్రీ, కూతురు కాకినాడలో కాపరంపెట్టారు. సుబ్రమణ్యం కూతురికి వుద్యోగాలు అవీ చేసేఅవసరం లేకపోయినా, మనసు మళ్ళించేందుకని బి. ఎ. లో చేర్పించాడు. జయ జీవచ్ఛవంలా అయింది. పూర్వపు నిగారింపు లేదు. కాలేజీకి వెళ్ళేది-వచ్చేది.

“నేనున్నాను-నీకెందుకమ్మా” అని ధైర్యంచెప్పేవాడు తండ్రి.

“నేనున్నాను నీకేం తక్కువ” అనేవాడుభర్త పూర్వం. కాని ఏడీ ఆభర్త?

సుబ్రమణ్యానికి జయసాయం, జయకి సుబ్రమణ్యం సాయం. అలా తండ్రీకూతుళ్ళిద్దరూ కాలం గడుపుతుండేవారు. జయ బి. ఎ, పరీక్షకు కూచుంది.

వేసంగిశలవల్లో కాలేజీ మూసెయ్యగానే యిద్దరూ పాలకొల్లు వెళ్ళిపోయారు.

అది సాయింత్రంవేళ. మెల్లాలో కూచుని జయ “గీతాంజలి” చదువుతోంది. చీకటిపడింది. దీపంముట్టించి మరోగేయం చదివింది. కాని షికారుకని వెళ్ళిన తండ్రి ఎంతకీ రాకపోవడంవల్ల ఆమెధ్యాస పుస్తకంమీదనుంచి మళ్ళింది. మనసు పరి పరి విధాల పోయింది. ఎనిమిదయింది. తొమ్మిదయింది. సినిమాకిగాని వెళ్ళాడా అనుకుంది—ఎప్పుడూ వెళ్ళడే! పదిగొట్టారు. మనుష్యులగుంపు ఒకటి తమయింటివైపే వొస్తోంది.

ఒక్కపరుగున వీధిలోపడ్డది. ఏముంది? నోటమ్మాట నురగలు. మనలోకంలో లేడు. మాంత్రికులొచ్చారు, వైద్యులొచ్చారు. విషంబాగా ఎక్కింది. పొలంగట్టున పాముకరచి పడుంటే తీసుకొచ్చారుట.

తెల్లవారేటప్పటికి తండ్రిగూడా జయని వదలి వెళ్ళిపోయాడు. “నేనున్నానుగా” అనే వాళ్ళు వొక్కరూలేరు జయకి.

తెల్లవారినతర్వాత వూళ్ళో నలుగురూ కలిసి కర్మకాండ ముగించారు. మూడోనాటిరాత్రికి ఎక్కడినుంచి, ఎలావచ్చివూడిపడ్డారో సత్యం, అతని పెళ్ళాం, నలుగురు పిల్లలూ దిగారు. ఒదినగారిముఖంగూడా మర్చిపోయింది జయ.

అప్పటికిగాని జయకి తను నిరాధారనని తెలియదు. వొదినగారు అన్నగారూ అంతా తమస్వంతం అయినట్టు పనులూ, రాతకోతలూ మొదలెట్టారు.

జయకి మిగిలింది, ఒకబట్టలపెట్టా, ఒంటెపేట గొలుసూ, ఒకగాజుల జతా, రిస్టువాచీ. నాన్న అకస్మాత్తుగా పోవడంవల్ల వున్నదీ, మన్నదీ అంతా అన్నగార్కి దక్కింది.

జయ ఆస్తిపాస్తులడగలేదు. బి. ఇడి. పూర్తి చేసుకునేందుకు వెయ్యో పదిహేను వందలో యిమ్మంది. “తిన్నదంతా చాలదూ యింకా కావాలిట అన్నిముచ్చట్లూ తీరాయిగా?” అని వదినెగారు పక్కగదిలోంచి అన్న మాటలు జయ చెవిని బడ్డాయి. మర్నాడు తన బట్టలపెట్టా, గొలుసూ గాజులూ అమ్మగావచ్చిన మూడువందలూ పుచ్చుకుని పట్నం వచ్చి వై. డబ్లియు. సి. ఏ లో జేరింది.

కాన్వెంటు సిస్టర్ వెనక ఎరుగున్నదే కాబట్టి బి.ఇడి. కాకపోయినా ఫర్వాలేదని కనికరించి టీచరుగా చేర్చుకుంది.

డిప్టీకలెక్టరు కూతురూ, ఐదువందల రూపాయల జీతగాడిభార్య అయిన జయ జీవితపు విలువ నెలకి డెబ్భయిరూపాయిలు. జయ బతుకుతుంది, చావదు. తండ్రి ఎవరు? భర్త ఎవరు? తనకోసం తను బతుకుతుంది. నెమ్మది నెమ్మదిగా బి. ఇడి. కూడా అవుతుంది.